ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# జాషువా సాహిత్యం - మహిళా చైతన్యం

డాక్టర్ చాట్ల కిషోర్

తెలుగు శాఖాధ్యక్షులు, కాకాని వేంకటరత్నం కళాశాల, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా

సెల్: 9866820524

Article Received: 10/02/2026

Article Accepted: 12/03/2026

Published Online: 15/03/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.108

**పరిచయం:**

మ|| గురు శృంగార రసంబునం కృతి మెరుంగుల్ దిద్దుకోకుండన
ల్వురి మెప్పుల్ గనదంచు లాక్షణికులెప్డో చట్టముల్ జేసిపో
యిరి వీరి నియమంబునన్ వనితనట్లే రచ్చ కెక్కించుచుం
దురు కవ్యగ్రణులుం ప్రధాన కథ యేత్రోవం బ్రయాణించినన్. (పుట 1583, ముసాఫరులు).

ఈ సిద్ధాంతాన్ని బద్దలు కొట్టి వారి చల్ది పాండిత్యాన్ని నిరాకరించి గొప్ప నిబద్ధతతో రచనా వ్యాసాంగాన్ని కొనసాగించిన విశ్వకవి గుఱ్ఱం జాషువా.

ఉ|| పెద్దల శల్యముల్ బలే వివేక మొసంగని గ్రంథరాసులే
విద్దియలైన నింక పదివేల యుగాల్దలకాయలేని గం
గెద్దులు బుట్టి స్వార్థపరులెత్తిన గంతలు మోసి తీరెడిన్
బుద్ధి చిగుర్చునే అరుచిబుట్టు కథల్ తల మీద రుద్దినన్ (గబ్బిలం -2,)

అంటూ పుక్కిట పురాణాలను తిరస్కరించిన మహాకవి గుఱ్ఱం జాషువా.

ప్రాయకంగా దళిత కవిగా కీర్తి గడించిన జాషువాలో ఒక సంస్కరణోద్యమ కవిని, జాతీయోద్యమ కవిని, మానవతావాద కవిని గమనించవచ్చు. జాషువా అనేక సాహిత్య ప్రక్రియలలో గొప్ప రచనలు చేశాడు. శివాజీ, ఫిరదౌసి, గబ్బిలం, క్రీస్తు చరిత్ర ఖండకావ్యాలు ఏడు భాగాలు, నాగార్జునసాగర్ మొదలైనవి. ఆయన పద్య కావ్యాలు, అలాగే పౌరాణిక నాటకాలు, క్రైస్తవ ఇతివృత్తనాటకాలు, చారిత్రక నాటకాలు, తెరచాటు వంటి సాంఘిక నాటకాలు రాశారు. నా కథ పేరుతో ఆయన జీవిత చరిత్రను రెండు భాగాలుగా వెలువరించారు. సుమారుగా వివిధ ప్రక్రియలలో 37 పైగా రచనలను వెలువరించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి గుర్రం జాషువా. తన కాలం నాటి రాజకీయ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

సామాజిక ఆర్థిక పరిస్థితులను గమనిస్తూ తన ఖండకావ్యాలకు ఇతివృత్తాలుగా స్వీకరించి పద్య రూపంలో మనసుకు హత్తుకునేలా రచన సాగించారు జాషువా. జాషువా రాసిన అనాధ కావ్యాన్ని తొలి దళిత మహిళా కావ్యంగా పేర్కొనవచ్చు. జాషువా మహిళా చైతన్యానికి దీనిని పునాదిగా పేర్కొనవచ్చు జాషువా రచనా జీవితం 1917లో వచ్చిన హిమదామార్కధర పరిణయముతో ప్రారంభమైంది. 1932లో వచ్చిన ఫిరదౌసి జాషువాలోని అసలు సిసలు కవిని ప్రపంచానికి పరిచయం చేసింది. 1934లో అనాధ కావ్యం వచ్చింది. అప్పటినుంచి 1966లో వచ్చిన నాగార్జునసాగర్ వరకు జాషువా సాహిత్యంలో స్త్రీ చైతన్యం అంతర్వాహినిగా కొనసాగింది. మహాకవిగా నవయుగ వైతాళికుడిగా విశ్వకవి సామ్రాట్ గా, కవి చక్రవర్తిగా, మధుర శ్రీనాథ, కవి కోకిల వంటి బిరుదులతో పద్మభూషణ్ గుర్రం జాషువా తెలుగు సాహితీ ప్రపంచాన్ని ఓలలాడించారు.

మ|| "కవి శక్రేశుడ గండపెండేరములన్ గాంగేయతీర్థంబులన్
వివిధోపాయన సత్కృతుల్ గొనిన గాంధీ శాంతి సిద్ధాంత మా
ర్దవ మార్గాటుడ గబ్బిలంబులకు దౌత్యంబుల్ ప్రబోధించు మా
నవతాస్రష్టను నవ్యభావ చతురుండన్ జాషువాభిఖ్యుడన్."

అని నినదించిన జాషువా కవిత్వంలో స్త్రీ చైతన్యం అనేక పాయలుగా ప్రవహించింది. జాషువా స్త్రీ చైతన్యాన్ని ప్రగాఢంగా కాంక్షించారు. జానపద స్త్రీల వీరత్వాన్ని, వారి త్యాగాన్ని కొనియాడారు. చరిత్ర పుటల్లో కలిసిపోయిన స్త్రీమూర్తులు ఔన్నత్యాన్ని, వారి బలమైన వ్యక్తిత్వాన్ని, వారి ధైర్య సాహసాలను మన కళ్ళ ముందు ఉంచి ఆధునిక మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఆధునిక మహిళలు సాధిస్తున్న విజయాలను కొనియాడుతూ పురుషుల కంటే స్త్రీలు ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ స్త్రీ ఏ రంగంలో విజయం సాధించినా వారిని ప్రత్యేకంగా పేర్కొని తన సాహిత్యంలో స్థానం కల్పించి వారి కీర్తిని చిరస్థాయిగా నిలిపారు. ఒక తల్లిగా, భార్యగా, కుమార్తెగా, స్త్రీల ప్రాధాన్యాన్ని ముఖ్యంగా చదువుకున్న స్త్రీ సమాజాన్ని మార్చగలదని తన పాత్రల ద్వారా నిరూపించారు. జాషువా స్త్రీ పాత్రలను జానపద స్త్రీ పాత్రలు, చారిత్రక స్త్రీ పాత్రలు, ఆధునిక స్త్రీలు, ఈ విధంగా జాషువా చిత్రించిన స్త్రీలను మూడు రకాలుగా విభజించవచ్చు.

**జానపద స్త్రీలు - చైతన్యం:** మనుమసిద్ధి సైన్యాధ్యక్షుడు అయినా ఖడ్గతిక్కన యుద్ధరంగం నుండి పారిపోయి వచ్చినప్పుడు అతని భార్య అయిన చానమ్మ అతన్ని పురికొల్పి యుద్ధ రంగానికి పంపిన వైనాన్ని జాషువా వీర రసాత్మకంగా వీర చానమ్మ అనే కవితా ఖండికలో వర్ణించారు. భారతీయ స్త్రీలు ముఖ్యంగా ఆంధ్ర స్త్రీలు పోరాటంలో భర్త మరణించినా ఓర్చుకోగలరు. కానీ యుద్ధరంగం నుండి పారిపోయే వస్తే అసలు సహించలేరు.

అందుకే జాషువా సృష్టించిన వీర చానమ్మ...

మ|| అనిలోనన్ మరణించియున్న భవదీయంబైన దేహంబుతో
ననలంబున్ వరియించి స్వర్గపురసౌఖ్యంబున్ సమార్జించి యుం
దును దీనాకృతి బారి వచ్చు మను పిన్నుం గూడి జీవించుటె

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

ట్లని నిట్టూరుచు వీరకాంతను సమస్తాంధ్రంబుభూషించడిన్ (ఖండకావ్యం-6)

ని పిరికిపంద చర్య మూలంగా ఇప్పుడు మనం ముగ్గురు ఆడవాళ్ళం అయ్యాము. వీరులు ధరించే డాలు డమాలు మాణిక్య రత్నాన్చితంబైన ఖడ్గంనీకెందుకని తన భర్తను అసహ్యించుకొన్నది. గడగడ కొక్క పుట్టెడు రక్తమర్పించి మనమసిద్ధుల సేన పెనుగుచుండగా నా పుత్రుడు విజయుడై తిరిగి వస్తాడని నీ తల్లి ప్రోలమ్మ నన్ను నమ్మిస్తుంటే ఖడ్గతిక్కన కత్తి కఱకు దారుణం అంటూ మా బావ తిక్కన్న గర్వంగా చెబుతుంటే ,మీ మొక్కవోని బుజ బలం వ్యర్థం కాదని రాజు నమ్ముతుంటే నువ్విలా ప్రాణభీతితో పారిపోయి రావడం ఎంత అవమానకరం పసుపు రాసుకుని ముసుగులో స్నానమాచరించమని భర్తని ఎత్తిపొడిచి అతనిలో కరకు వీరావేశాన్ని రగిలించే విధంగా పురికొల్పిన వీర చానమ్మ కు జాషువా కవితా సుమాక్షతలు కురిపించాడు.

**చారిత్రక స్త్రీ పాత్రలు - చైతన్యం:** జాషువా అనేక చారిత్రక స్త్రీ పాత్రల ద్వారా స్త్రీలలో చైతన్యాన్ని నింపాడు. వీరాబాయి జిజాబాయి వంటి పాత్రలు దీనికి ఉదాహరణలు. అలాగే జేబున్నీసా వంటి స్త్రీల ఉన్నత వ్యక్తిత్వాన్ని కూడా తెలియజేశాడు. యుద్ధానికి సిద్ధమవుతున్న శివాజీని దీవిస్తూ జిజాబాయి ఆశీర్వదించే ఘట్టంలో జాషువా రాజమాతల యుద్ధకాంక్షను క్షత్రియ కాంతుల వీరోచిత స్వభావాన్ని వర్ణిస్తాడు.

సీ: వైరి నెత్తురుబొట్టు వదనాబ్జమునగ్రాల ముదమార తిరిగివచ్చెదవుగాక
తినిపించెదవుగాక ఇనుప కత్తుల కీవు ముదురు కందనగాయ భోజనంబు
త్రావించెదవుగాక దండిబల్లెములకు పరుల క్రొవ్వేడి నెత్తురులతేనె
కీలించెదవుగాక గెలుపు జండాపూలు కంచుకోటల మస్తకములమీద.

తే. గీ. స్వర్గమున నుండి యున్న శంబాజి నీకు
గుసుమ కింజల్క వర్షంబు కురియుగాక
భరత జనయిత్రి మోదబాష్పములు విడిచి
ప్రేమనినుదెచ్చి నాకునర్పించుగాక ....అని దీవిస్తుంది (ఖండకావ్యం 3).

జిజాబాయి తన కుమారుడని పెంచిన విధానాన్ని శివాజీ నాటకంలో రోమాంచితంగా వర్ణించాడు. జాషువా అసలు భారతీయ జాతి జీవితాలు చితికి పోవడానికి కారణం విక్రమ క్రమశిక్ష వెన్నతో పెట్టే జిజియా వంటి మాతృదేవతలు లేకపోవడం వల్ల అని విచారిస్తాడు. సమాజాన్ని రుజువర్తనంలో ఉంచడానికి తల్లి పాత్ర ఎంతో ఉందంటాడు. జాషువా చిన్నా నాయకుడు అనే నవలలో తల్లిని గురించి వివరిస్తూ "బిడ్డలకు ఎప్పుడు తండ్రి గుణముల కన్నా తల్లి గుణములు పట్టుబడుటకు అవకాశం మిక్కుటము శారీరకముగా బిడ్డలలో తల్లి రక్తమే మిక్కుటముగా ప్రవహించుచుండెను. వారిలోని ప్రతి రక్తకణము ప్రతి నాడి ప్రతి కండరము తల్లి వైపునకు మొగ్గి ఉండును. తల్లినాటిన మాటల వలె తండ్రి మాట నాటుకొనలేదు. తండ్రిది రెండవ స్థానము .... తల్లి ప్రథమ ఉపాధ్యాయ అయి బిడ్డకు శీలవిద్యను నేర్చుకున్న మీదట గురుముఖమున కాంచిన విద్య రాణింపనేరదు. భారతదేశ మీ రహస్యమును గ్రహించనంత కాలము ఉత్తమ భారతీయ విద్యలు ఉద్భవిల్లుటకు అవకాశం శూన్యము అహింస,

సమభావం, దయాగుణము, త్యాగబుద్ధి మున్నగు దివ్య గుణములను ఉగ్గుపాలతో తన సంతానమునకు నూరిపోసుకుని భారము తల్లిది తల్లి మూఢమతి అయి తన మూఢవిశ్వాసంతో తన దురాచార పరత్వముతో తన స్వార్థ చింతతో పెంచి పాఠశాల కంపిన ఆదర్శ పౌరులు తయారవుట కలలోని వార్త శశవిశాణము గగనకుసుమము స్త్రీ విద్యా ప్రయోజనమును ఇప్పటికైనను భారత భూమి గ్రహించిన చాలును" అంటాడు. (చిన్నా నాయకుడు) ఈ సందర్భంగా చిన్నప్పుడు తాను అంటరానితనాన్ని ఎదుర్కొనే సందర్భంలో తన అవమానాన్ని తల్లికి చెప్పినప్పుడు జరిగిన సంగతిని గుర్తు చేసుకుంటాడు.

ఉ|| ఏడిచి చెప్పితిన్ విషయమెల్లను నా జనయిత్రి గూర్చి ము
ద్దాడుచు నాయనా ఇది భయంకర దేశము వర్ణ భేదముల్
గూడులు కట్టుకున్నవనకూడదు పంచమ జాతి వారికిన్
కూడుహుళక్కి మానవత కూడ హుళక్కి, హుళక్కి జన్మమున్.

అని విషమ సమాజ పోకడను ఆనాడే తనకు వివరించిందని గుర్తు చేసుకుంటాడు.

జాషువా సృష్టించిన మరో వీరనారి వీరాబాయి. ఈనాటకాన్ని జాషువా 1926లో రాశాడు. చిత్తోడ్ ను పరిపాలించిన ఉదయ్ సింహుని భార్య వీరా బాయి. ఢిల్లీని అక్బర్ పరిపాలిస్తున్న కాలంలో ఉదయ సింహుడు, కుమారుడు రాణా శత్రువుల చేతిలో చిక్కి మరణించినప్పుడు తాను స్వయంగా యుద్ధంలో పాల్గొని చిత్తూరు ను కాపాడుకోవాలని శరీరం నిండా గాయాలతో మరణానికి దగ్గర అయి తన సైన్యంలో ఆవేశం రగులుగొలుపుతూ మాట్లాడిన మాటలు పాఠకు హృదయంలో ఆవేశాన్ని నింపుతాయి. "ఇదిగో భూమి ఆకాశములు సాక్షిగా నా సర్వ శరీరం నా పవిత్ర రక్తమును దేశ సంరక్షణార్థము ధారబోయుచున్నాను. బ్రహ్మాండము బ్రద్దలగుగాక సముద్రములు మిన్నుముట్టు గాక చుక్కలూడిపడు గాక వెన్నుచూపకుడు. ఆజ్యము పోసిన అగ్నులై కసరరేగిన సింగములై జన్య క్షేత్రమున రుధిర వృష్టి యందు యశోబీజములను వెదజల్లుడు చిత్తూరు గవనికి కపాల తోరణములను గైసేయుడు మీ నామ సంకీర్తనమునకై దిగంగనలు వీణలు శృతి చేయుచున్నారు. నేను మీకు సహాయ పడగలను అని వీరమరణం పొందిన ఘట్టం అజరామరం అనిపిస్తుంది. మాతృమూర్తిగా దేశ క్షేమాన్ని కోరే రాజమాతగా పిరికివాడైన రాజుకు ధైర్యం నూరిపోసే మహారాణిగా చివరికి యుద్ధంలో స్వయంగా పాల్గొని దేశ రక్షణకు ప్రాణాలర్పించిన వీర వనితగా వీరాబాయి పాత్రను అత్యద్భుతంగా మలిచి స్త్రీ ఔన్నత్యాన్ని చాటాడు. జాషువా (వీరాబాయి: నాటకం).

జాషువా వెలుగులోనికితెచ్చిన మరో గొప్ప వ్యక్తిత్వంకలిగిన స్త్రీ జేబున్నీసా. ఢిల్లీని పరిపాలించిన ఔరంగజేబుకుమార్తె జేబున్నీసా లాహోర్ గవర్నర్ అయిన ఎక్విల్ ఖాన్ ను ప్రేమించింది. ఔరంగజేబు ఎక్విల్ ఖాన్ ను చంపించాడు తన ప్రేమ విఫలమై ప్రియుడు దారుణంగా చంపబడినప్పుడు అతని సమాధి పైబడి హృదయ విదారకంగా రోదించే జేబున్నీసాను అత్యంత కరుణరసాత్మకంగా చిత్రించాడు జాషువా.

సీ: మొగలు రాజన్యుని పగడాల మేడలు వసియింప దింక నీ ప్రణయలక్ష్మి
ఢిల్లీ నవాబుల మల్లె తోటల వంక పరికింపదింక నీ వలపు జిలు క

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

ఔరంగజేబుని అపరంజి గిన్నెలో భుజియింపదింక నీ ముద్దులాడి

పాదుషా నగరిలో బట్టుపాన్పుల మీద పవళింపదింక నీ పాదదాసి(ఖండకావ్యము 1)

అని తన ప్రియుని ఎ డబాటుని సహించలేక అంతఃపురాన్ని వీడి రాజభోగాలన్నీ త్యజించి అతని సమాధి మీద పడి రోధిస్తూ అగ్నిలో దూకి మరణిస్తుంది. ఔరంగజేబు వంటి సర్వం సహా చక్రవర్తికి కుమార్తె అయి గొప్ప రాజవంశానికి వారసురాలైన జేబున్నీసా ప్రేమ కోసం ప్రాణాలర్పించిన తీరు ఆమె వ్యక్తిత్వానికి అద్ధం పడుతుంది.

స్త్రీ తను మనసిచ్చిన వారి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతుందనే విషయాన్ని అత్యంత కరుణరసాస్పదంగా చిత్రించి, జేబున్నీసాకు తెలుగు సాహితీ ప్రపంచంలో చిరస్థాయిని కల్పించారు. జాషువా రాసిన మరో ప్రేమ కావ్యం ముంతాజ్ మహల్ లో కూడా ఆయన స్త్రీ పక్షపాత దృష్టి స్పష్టంగా కనిపిస్తుంది. ముంతాజ్ పాత్రను గొప్ప సౌందర్యవతిగా అంతకంటే గొప్ప తాత్విక చింతన కలిగిన దానిగా చిత్రించాడు. ఆమె మరణశయ్యపై నుండి భర్తను బిడ్డలను ఓదార్చిన ఘట్టం ముంతాజ్ మహల్ కావ్యానికి తలమానికం ఈ సందర్భంగా జాషువా రాసిన తొమ్మిది పద్యాలు నవరత్నాలుగా తెలుగు సాహిత్యంలో భాసిల్లుతాయి. తన దీన స్థితిని చూసి దుఃఖిస్తున్న రాజుని ఓదారుస్తూ.... ముంతాజ్

ఉ|| ఈ సుఖదుఃఖ మిశ్రమ మహీ వలయంబున సత్రశాలలో
నీ సతినై ముగించితిని నేటికి నాదు ప్రవాసయాత్ర యో
ధీ సముపేత యిట్టి పరదేశుల చెల్మి తిరంబు గాదు క్ష్మా
వాస కథా విశేషములు స్వాప్నికముల్ చపలా విలాసముల్ (ముంటాజ మహలు)

అంటూ ఈ బంధాల అసలు రహస్యాన్ని బోధిస్తుంది భగవంతుడు తనను ఎలాగో వినియోగించు కుంటాడంటూ

ఉ|| ఏ పుష్పంబును చేసి వాడుకొనునో ఈ దేహమున్ దైవమో
భూప శ్రేష్ఠ విచారమందకుము మామూలే కదా ఈ మృతి
వ్యాపారంబు సమస్త జీవులకు విశ్వవ్యాఘ్రి గర్భంబునన్
మాపుల్ రేపులు నెందరో యి ముడుచున్నారందు నేనొక్కతెన్ (ముంటాజ మహలు)

అని ఊరడిస్తుంది.

అంత గొప్ప చక్రవర్తి కూడా మరణశయ్య ప్రక్కన నిలబడి దీన వదనంతో అచేతనుడై దుఃఖించే సన్నివేశం చూస్తే స్త్రీ లేకపోతే పురుషునికి మనుగడ, ఉనికి లేదనిపిస్తుంది. ఆయనే ఒక సందర్భంలో చెప్పినట్లుగా ఆడది లేకుండా నీరేడు జగంబులను శోభయే లేదనిపిస్తుంది. తన భార్య మేరీ మరణించినప్పుడు కూడా జాషువా వియోగభారంతో కొత్త లోకము కావ్యంలో మలి కోర్కె పేరుతో రాసిన పద్యాలు పురుషుడి జీవితంలో భార్య స్థానాన్ని తెలియజేస్తాయి. జాషువా దుఃఖిస్తూ,

మ|| కవి బ్రహ్మాండమునేలువాడతని యంకంబెక్కి యర్థాంగి రెం

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

డవ స్వర్గంబయి యేలుచుండునతనిన్ సాంసారిక క్లేశముల్
తవులన్నికటువంటి దంపతుల నేస్తంబున్ విదారించి స
త్కవితా కంఠమునుత్తరింతు విధియుక్తంబౌనె భక్త ప్రియా

అని భగవంతుని సైతం నిందిస్తాడు.

**ఆధునిక స్త్రీ - చైతన్యం:** ఆధునిక మహిళలను వారు సాధించిన విజయాలను కీర్తించారు. 1963 జూన్ 16న రోదసీలోకి ఎగిసిన తొలి మహిళగా విజయం సాధించి నారీలోకపు సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వాలంటీనా తెరిస్కోవా ను పరిచయం చేస్తూ

చం|| "అసమ విమాన చోదక మహా కళ నభ్యసనంబొనర్చి ఆ
కస మున సంచరించి మొనగాండ్రగు పూరుషులబ్బురింప రో
దసి విహరించి రష్యను లతాలలితాంగి ధృడాంగలంగనల్
వసుధ గ్రహింపుడంచు మగవాండ్ర అహంకృతి నూడగొట్టదే (ముసాఫరులు)

అని ప్రశంసిస్తాడు. ఇదే సందర్భంలో ఖండకావ్యం ఏడు లో వీర కుమారి పేరుతో ఎనిమిది కంద పద్యాలలో వాలంటీనా కు నీరాజనాలర్పించాడు. జాషువా

కం|| యావద్వి శ్వాంగనలకు
నీ వీరత్వంబు పూజనీయంబయి నూ
త్నా వేశజనకమై పుం
భావ సరస్వతుల జేసె వాలంటీనా

అంటూ యావత్ ప్రపంచంలోని మహిళా మణులు అందరికీ వాలంటీ నా నూతన జవసత్వాలను అందించిందని కొనియాడాడు. అయితే విశ్వ మహిళ ఇంతగా రోదసి వరకు దూసుకుపోతుంటే భారతీయ మహిళ ఇంకా వంచిత గానే మిగిలిపోతుందని ఆవేదన చెందుతాడు.

శా|| అమ్మా! భారతనారి!నీ కడుపునందావిర్భావంబంది నీ
యెమ్ముల్ బిండి సుఖించు పూరుషులనింకెన్నాళ్లు సేవించి కా
లమ్మున్ వ్యర్థము చేసుకొందువు? కరాళ స్వార్థధర్మాలలో
గమ్మత్తున్ గనిపెట్టి స్త్రీజగము దుఃఖంబున్నివారింపుమా! (ఖండకావ్యము 5)

అని స్త్రీ జాతిని మేలుకొమ్మని పిలుపునిస్తాడు జాషువా. ఈ అణుయుగంలో కన్నులు తెరవని నిన్ను చూచి అన్ని దేశాలు నవ్వుతున్నాయని హెచ్చరిస్తాడు. పుట్టుఖైదుగా ఇంట్లోనే మగ్గుతూ భారత స్త్రీ అంటూ సంబరపడటాన్ని నిందిస్తాడు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

ఒక ప్రక్క స్త్రీలను పరదాలలో బురఖాలలో దాచిపెడుతూ స్త్రీలకు స్వాతంత్ర్యం తప్పక అవసరం అని ఒక్కాణిస్తూ, సభల్లో ఉపన్యాసాలు ఇస్తూ వారి స్వేచ్ఛకు సంబంధించిన హిందూకోడు బిల్లుకు వ్యతిరేకంగా చట్టసభల్లో పోరాడుతున్న దొంగ సానుభూతిపరులను స్త్రీలు తెలుసుకోలేకపోతున్నారు. అందుకే స్త్రీలకు చదువు అవసరం అని నొక్కి చెప్తాడు జాషువా. సనాతన ధర్మం పేరిట ఎన్ని నాళ్ళు మౌనవహిస్తావని ప్రశ్నించాడు. సతీసహగమనం దురాచారంతో నిన్ను నాశనం చేసిన సమాజంలో ఇవాల్టికైనా పురుషుడు నీకు స్వేచ్ఛనిస్తాడా? అని ప్రశ్నిస్తాడు. పాములు సంతాన వరదాయకములంటూ ప్రార్థించే పెను వెర్రిబాగులమ్మలు ఔషధాలతో కాకుండా పిచ్చి సత్తులకు మొక్కి ప్రాణాలు బలి పెట్టుకునే పరమమూడలు కృతకాలైన పుక్కిట పురాణ కథలు సత్యం అని నమ్మే చపల హృదయులు వికట సాంఘిక శక్తులకు దేహం అర్పించి తన తలరాతకు ఏడ్చే విద్యావిహీనలు పసుపు రాసినా ముసుగు పెట్టినా మారు పలుక లేని మందబాగ్యలు ప్రపంచంలో మరెక్కడా ఉండరు మనదేశంలో తప్ప అంటూ ఈ సంస్కృతి మారాలని,

ఉ|| స్త్రీలను పుట్టు బానిసలజేసిన సంస్కృతి చెప్ప వారి గ్రం
థాలు పఠించి నాటక శతంబులనారసి బండవారి యా
శాలత లెండియున్న జలజాక్షికి నీకొకరీతిగా యప
థ్యాలయి గోచరించగల వద్యతనార్యకవి ప్రబోధముల్ (ఖండకావ్యం ఐదు).

అని ఆర్యకవుల ప్రబోధాల ప్రమాదాలను వివరిస్తాడు .

భారత స్త్రీ దుఃఖాన్ని పోగొట్టడానికి వెయ్యి రామరాజ్యాలు వచ్చినా పదివేల స్వరాజ్యాలు వచ్చినా సరిపోవు అంటాడు. ఎందుకంటే స్త్రీ జాతిని ప్రోత్సహించే శాసనాలకు ఈ దేశ నాయకులు అవరోధం అయ్యారు ఎప్పుడైతే కూడు గుడ్డ కోసం పురుషుడిపై ఆధారపడిందో నాటినుండి ప్రపంచానికి దూరమై బానిసలా బ్రతుకుతూ అనేక బాధలకగ్గమై నశించిపోతున్నారని జాషువా వంచితలో వాపోయారు. దేశాభ్యుదయానికి స్త్రీ విద్య ప్రధానమన్నది జాషువా నిశ్చితాభిప్రాయం. స్త్రీని విద్యకు దూరం చేయడమే వెనుకబాటుతనానికి ప్రధాన కారణం అని గుర్తించాడు.

ఉ|| భారతదేశ సంస్కృతికి భంగము వాటిలునంచు విద్యకున్
దూరము జేసి మీ బ్రతుకు దోపిడి చేయుటచేత లక్ష్యమున్
జేరక యన్య ఖండముల శేముషికిన్ గ నులప్పగించిని
ట్టూరుపులన్నిగుడ్డురు సహోదరీ నేటి స్వతంత్ర మానవుల్(వంచిత ఖండకావ్యం ఐదు)

అంటాడు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

వైదవ్యాగ్నిలో మునిగిపోయి వర్ణనాతీతమైన బాధలను అనుభవిస్తూ ఉన్న స్త్రీలకు శ్రద్ధాంజలి ఘటించాడు. జాషువా మూఢనమ్మకాలను ఆచరిస్తూ మగతనం లేని కొజ్జా భర్తలను భరిస్తూ వారి చేతిలో పడి నరకం చూస్తూ ఆత్మహత్యలకు పాల్పడే యువతులు అత్తమామల దాష్టికాలకు తట్టుకోలేక మంటల్లో కాలిబూడిదయ్యే వనితలు కరుణలేని శాస్త్ర కారుల అగ్నిగుండంలో పడే యువతులు ఈ దేశంలో పతివ్రతలుగా పుణ్యవతులుగా కీర్తించబడ్డారంటాడు. పైగా మొగుడు ఎంత హింసిస్తే అంత పుణ్యం లభిస్తుందని విశ్వసించే సమాజంలో మహిళల ఆక్రందనలు ఎవరికి పడతాయంటాడు జాషువా. కనుకనే నేటి నెలతలు తమ బుద్ధి బలాన్ని తెలుసుకొని ఉబ్బించు గాధల్లో ఉన్న కిట్టుకును గ్రహించి మగవారితో చేయి కలిపి కలము పట్టి ముందుకు సాగాలని జాషువా ఆకాంక్ష.

**ముగింపు:** జాషువా తరతరాలుగా స్త్రీకి జరుగుతున్న అన్యాయాన్ని చెప్పడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. తద్వారా స్త్రీలు తమపై జరుగుతున్న కుట్రలను తెలుసుకొని ఈ వ్యవస్థ మీద తిరగబడతారని ఆయన ఆశ. మహిళల హక్కుల పట్ల అవగాహన కల్పించడం సామాజిక మార్పును కోరుకోవడం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వారి సామూహిక శక్తులను గుర్తించడం. ఇటువంటి లక్షణాలు కలిగిన స్త్రీలను తన సాహిత్యంలో చిత్రించడం జాషువా చేసిన పని వివిధ పాత్రలు సన్నివేశాల కల్పనలో భాగంగాను, ఖండకావ్యాల్లో స్వయంగాను మహిళల పట్ల తనకున్న దృక్పథాన్ని తెలియజేశారు. జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ద్వారా మహిళలు తమ శక్తిని గుర్తించి, అణిచివేతను ఎదిరించి స్వతంత్రంగా జీవించ గలిగి, మానసిక ధైర్యాన్ని, వ్యక్తిత్వాన్ని సమకూర్చుకుంటారు.

**ఆధార గ్రంథాలు:**

1. జాషువా సర్వ లభ్య రచనల సంకలనము,
2. జాషువాతో అనుభవాలు జ్ఞాపకాలు: తెలుగు అకాడమీ హైదరాబాద్ ప్రచురణ,
3. జాషువా సాహిత్యం దృక్పథం పరిణామం: డాక్టర్ సుధాకర్